ఆకు కూరలతో సంపూర్ణ పోషణ


అరట్లకట్టలో ఆకు కూరలను పంపిణీ చేస్తున్న సీడీపీఓ సీహెచ్ ఇందిర (ఫైల్)


చింతపర్రులో అంగన్‌వాడీ కేంద్ర ఆవరణలో పెంచుతున్న ఆకు కూరలు


భగ్గేశ్వరం అంగన్‌వాడీ కేంద్ర ఆవరణలో పోషణ వాటిక

- అంగన్‌వాడీ ఆవరణలో పోషణ వాటికలు
- గర్భిణులు, బాలింతలకు ఆకు కూరలతో భోజనం

పాలకొల్లు అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం చేస్తున్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం గతేడాది అక్టోబర్‌లో పోషణ వాటిక పథకాన్ని ప్రవేశపెట్టింది. పక్కా భవనం ఉన్న ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికీ పోషణ వాటిక అమలు చేసింది. ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10 వేలు కేటాయించి, నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో అంగన్‌వాడీ కేంద్రంలో ఆవరణలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆకు, కాయ కూరల పెంపకాన్ని ప్రోత్సహించింది. పాలకొల్లు నియోజకవర్గంలో పోడూరు మండలం, పాలకొల్లు పట్టణం, మండలం, యలమంచిలి మండలాల్లో 258 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల సొంత భవనాల ఆవరణలో తోటకూర, గోంగూర, మెంతి కూర, బచ్చలి కూర, పాలకూరతో పాటు వివిధ రకాల కాయగూరలు కూడా పండిస్తున్నారు.

రక్తహీనతకు చెక్

గర్భిణులు, బాలింతలకు ఆకు కూరలు ఎక్కువ తినడం వల్ల రక్తహీనత సమస్యలు తలెత్తవు. ఈ కూరలు తినడంతో రక్త శాతం వృద్ధి చెందడం వల్ల పుట్టిన బిడ్డలకు లేదా పుట్టబోయే బిడ్డలకు రక్తహీనత సమస్యల నుంచి గట్టెక్కడంతో పాటు ఆరోగ్యకరంగా పెరుగుతారని వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

పోషణ వాటిక వివరాలు

పాలకొల్లు మండలంలో మొత్తం 78 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 41 కేంద్రాలకు సొంత భవనాలుండడంతో పోషణ వాటికలు ఏర్పాటు చేశారు. పాలకొల్లు పట్టణంలో 25 కేంద్రాలు ఉన్నప్పటికీ పక్కా భవనాలు లేకపోవడంతో పోషణ వాటికలు ఏర్పాటు చేయలేదు. యలమంచిలి మండలంలో 85 కేంద్రాలకు 34, పోడూరు మండలంలోని 70 కేంద్రాల్లో 33 భవనాల్లో పోషణ వాటికలు నిర్వహిస్తున్నారు.

ఆకు కూరలు అందిస్తున్నాం



అంగన్‌వాడీ కేంద్ర ఆవరణలో పోషణ వాటికలో ఆకు కూరలు పెంచుతున్నాం. గర్భిణులు, బాలింతలకు ఆకు కూరలు అందిస్తున్నాం. చిన్నారులకు మధ్యాహ్న భోజనంలో ఆకు కూరలు వండి వడ్డిస్తున్నాం.

– సత్యవతి, అంగన్‌వాడీ టీచర్, అరట్లకట్ట

క్లుప్తంగా

అన్నసమారాధన


అన్నసమారాధనను నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: సీతారాంపురం నార్త్ గ్రామంలో 61వ సప్తాహ మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని సోమవారం భారీ అన్న సమారాధన ఏర్పాటుచేశారు. సుమారు వెయ్యిమందికి పైగా భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. సప్తాహ మహోత్సవాలకు సహకరించిన దాతలందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నార్తులను ఆదుకోవడమే దైవసేవ


వడ్డిలంకలో అగ్నిప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న సభ్యులు

యలమంచిలి: అన్నార్తులను ఆదుకోవడమే నిజమైన దైవసేవని యలమంచిలి మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బత్తుల దేవదానం అన్నారు. ఇటీవల వడ్డిలంక గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కామన మారియ్య – నాగమణి, కామన నాగేశ్వరరావు – దుర్గాభవానిల కుటుంబాలకు పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు సోమవారం దుస్తులు, వంట సామగ్రి, కాయగూరలు, బియ్యం బస్తా అందజేశారు. వారు పాస్టర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్స్ గుసుపూడి రాజబాబు, తాడి నరసింహరావు, ఐజక్ పాల్ ఇంగువ, సీమోను, ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా భూసర్వే


కోడేరులో భూసర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ

పెనుగొండ: రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భూ సర్వేను పక్కాగా నిర్వహించాలని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. సోమవారం కోడేరులోని భూ సర్వేను ఆయన పరిశీలించారు. రీ సర్వే పై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు కనకరాజు, రీ సర్వే డీటీ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన


కుష్ఠుపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పోడూరు: కుష్ఠు వ్యాధి లక్షణాలుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డి.సుప్రజ సూచించారు. పోడూరులో సోమవారం కుష్ఠు నివారణలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుష్ఠు లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, అరచేతులు, అరికాళ్లు స్పర్శ లేకపోవడం, చెవులపై, వీపుపై, ఛాతీపై, నొప్పిలేని బొడిపెలు రావడం , చల్లని, లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం వంటివి కుష్ఠు లక్షణాలని వివరించారు. ఫిబ్రవరి 2వ తేదీ వరకు గ్రామాల్లో కుష్ఠు వ్యాధిపై సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆచంటలో పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభం


పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ నయీం, మండలి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

పెనుగొండ: నియోజకవర్గ కేంద్రమైన ఆచంటలో రూ.1.40 కోట్లతో నిర్మించిన మోడల్ పోలీస్ స్టేషన్ భవనాన్ని సోమవారం సాయంత్రం ఎస్పీ నయీమ్ అజ్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేరాల అదుపుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ఆలస్యమైనా ఆచంటలో అధునాతనమైన మోడల్ పోలీస్ స్టేషన్‌ను నిర్మించామని తెలిపారు. త్వరలో పెనుమంట్ర పోలీస్ స్టేషన్‌కు కూడా అధునాతన భవనాన్ని నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, భీమవరం, తణుకు ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, ఆరుమిల్లి రాధాకృష్ణ, ఎమ్మెల్సీలు వంక రవీంద్రనాథ్, కౌరు శ్రీనివాసు, ఇళ్ల వెంకటేశ్వరరావు బొర్రా గోపి మూర్తి, అడిషనల్ ఎస్పీలు భీమారం మురళీకృష్ణ, ఆర్డీఓ దాసి రాజు, డీఎస్పీ శ్రీ వేద, సీఐ రాయుడు విజయ్ కుమార్, కె.వెంకటరమణ, జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, సర్పంచ్ కోట సరోజిని పాల్గొన్నారు.

నేడు ఎస్వీకేపీలో బాల వ్యాకరణావధానం

పెనుగొండ: స్థానిక ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో మంగళవారం పోడూరు మండలం మినిమించిలిపాడులో 10వ తరగతి విద్యార్థి ముక్కే హారికచే బాల వ్యాకరణావధానం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వైవీవీ అప్పారావు తెలిపారు. పరీశీలకులుగా తెలుగు పండిట్లు ఆరుపల్లి వెంకట్రావు, గుత్తుల నానాజీ, ఇంజిమూరి కిషోర్ కుమార్, పున్నాల పెద్దిరాజు, తాడిమేటి శ్రీదేవి, పెద్దిన లక్ష్మి, కలగ అచ్యుతరామ లక్ష్మీపతి దీక్షితులు, పంపన శ్రీనివాసు, తాడేపల్లి వీరలక్ష్మి, భూపతి బంగార్రాజులు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించే సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే త్సవటపల్లి సత్యనారాయణమూర్తి (బాబ్జి), సహస్రావధాని కడిమిళ్ల వరప్రసాద్, బాల వ్యాకరణ రచయిత పరవస్తు ఫణిశయన సూరి, తాడి నాగిరెడ్డి, కలిదిండి రామచంద్రరాజు, ఉద్దగిరి లవకుమార్, కేవీఎస్‌డీ వరప్రసాద్, వత్సవాయి వెంకట్రాజు, చల్లా మల్లికార్జునశర్మ, ఆచార్య రంకిరెడ్డి రామ్మోహనరావు, చల్లా అన్నపూర్ణేశ్వరరావు, జోశ్యుల మురళి కృష్ణ పాల్గొంటారని వివరించారు.

గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు


కొంతేరులో పశువులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ చంద్రశేఖరరెడ్డి


పెనుమంచిలిలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సురేష్ బాబు

యలమంచిలి: ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లో సోమవారం నుంచి ఈ నెల 31 వరకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు మండల వైద్యాధికారి పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. సోమవారం అడవిపాలెం, కొంతేరు గ్రామాలలో 142 పశువులకు వైద్యం అందించామన్నారు. 26 దూడలకు ఏలికపాము మందులు, 80 పశువులకు వ్యాక్సినేషన్, 16 పశువులకు చూడు పరీక్షలు, 14 ఎదకు రాని పశువులకు పరీక్షలు, ఆరు నీరసంగా ఉన్న పశువులను గుర్తించి వైద్యం అందించామని ఆయన వివరించారు. ఉచితంగా మందులు అందజేశామన్నారు. మంగళవారం కాజతూర్పు, కాజ పడమర గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ శిబిరాల నిర్వహణకు పశు సంవర్ధక సహాయకులు నిల్లా సత్యశ్రీ, షబీర, సునంద, భవాని, దొరబాబు, వెంకన్నబాబు, తరుణ్‌లు సహకరించారు.

పాడి రైతుల అభ్యున్నతే లక్ష్యం

పెనుగొండ: పాడి రైతుల అభ్యున్నతి కోసం నిర్వహించే పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. సోమవారం ఆచంట మండలం పెనుమంచిలిలో పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పశువైద్యాధికారి ఫణికుమార్, జయకర్ జాన్సన్, సుధాకర్‌లు పాల్గొన్నారు.

చినమల్లంలో..

పెనుగొండ మండలం చినమల్లంలో పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ ప్రమీలారాణి ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపులు

నరసాపురం: ఆధార్ కార్డుల్లో మార్పులు చేర్పులు, చిన్నపిల్లల ఆధార్ నమోదు, అప్డేట్ కోసం పట్టణంలో స్పెషల్ క్యాంపులు నేటి నుంచి ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు ఏర్పాటు చేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య తెలిపారు. ఈనెల 24 వరకు వనువులమ్మ గుడి అంగన్‌వాడీ సెంటర్, గంటలమ్మ గుడి ఏరియా అంగన్‌వాడీ సెంటర్, ఎన్టీఆర్ కాలనీ అంగన్‌వాడీ సెంటర్లలో, ఈనెల 27 నుంచి 30 వరకు కృష్ణబాబు కాలనీ అంగన్‌వాడీ సెంటర్, కొండాలమ్మగుడి ఏరియా అంగన్‌వాడీ సెంటర్లలో ఈ క్యాంపులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

స్థలాల సర్వే కోరుతూ ఫిర్యాదులు


మొగల్తూరులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రాజకిశోర్

నరసాపురం రూరల్: మొగల్తూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మూడు ఫిర్యాదులు అందినట్టు తహసీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. వివాదంలో ఉన్న తమ స్థలాలను సర్వే చేసి న్యాయం చేయాలని ముగ్గురు వ్యక్తులు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ త్రిశూల పాణి, పీఆర్ ఏఈఈ వెంకటేశ్వరరావు, ఏఓ రహీమ్, ఎంఈఓ శామ్యూల్ జాన్, మండల పర్వేయర్ దస్‌రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్‌రావు, ఈవోపీఆర్డీ నవీన్, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్, జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు సి.నాగరాణి సభ్యత్వ నమోదుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఒక లక్ష రూపాయల కంటే ఎక్కువగా సభ్యత్వ రుసుమును సేకరించిన తణుకు తహసీల్దార్, తాడేపల్లిగూడెం మున్సిపల్ కమీషనర్‌లను జిల్లా కలెక్టర్ అభినందించారు. అనంతరం కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ద్వారా సేకరించిన నిధులను సమాజ సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తామన్నారు. ముఖ్యంగా వరదలు, అగ్ని ప్రమాద బాధితుల సహాయానికి, రక్తదాన కేంద్రాల అభివృద్ధికి, ఇతర మానవతా కార్యక్రమాలకు వినియోగిస్తామన్నారు.

బెల్ట్ షాపులతో గీత వృత్తికి చేటు


సమావేశంలో మాట్లాడుతున్న బొక్కా చంటి

నరసాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి సందులో బెల్ట్ షాపులు ఏర్పాటు చేయడంతో గీత వృత్తి సర్వనాశనమైందని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొక్కా చంటి ఆరోపించారు. సోమవారం స్థానిక మీరా గ్రంథాలయ భవనంలో నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లుగీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం అసలు పట్టించుకోవడం లేదన్నారు. బెల్ట్ షాపుల వల్ల గీత కార్మికులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు పడిన కార్మికుడికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, 50 ఏళ్ల పైబడిన కార్మికులకు పింఛన్లు, ప్రతి గీత కార్మికుడికీ సబ్సిడీపై బ్యాంకు రుణాలు ఇవ్వాలని కోరారు. నరసాపురం డివిజన్‌లో బెల్ట్ షాపులు అరికట్టకపోతే కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘ నాయకులు బొక్కా సోమేశ్వరరావు, బండి పోలేశ్వరరావు, దొంగ వెంకటేశ్వర్లు, ఇర్రింకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సేవల్లో 'సెవెన్ ఆలివ్స్' ఆదర్శనీయం


విద్యా సామగ్రి, నోట్ పుస్తకాలను అందిస్తున్న టీచర్ రీటా


కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అని చెప్పిన మదర్ థెరిసా మాటలకు కట్టుబడి సేవా కార్యక్రమంలో ఆదర్శనంగా నిలుస్తుందని సెవెన్ ఆలివ్స్ ఫౌండేషన్. 2000వ సంవత్సరం నుంచి ఏటా సుమారు రూ.12 లక్షలు ఖర్చు చేస్తోంది. నరసాపురం మండలం పసలదీవి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు గుంపుల రాజారత్నం, శాంతమ్మ దంపతులకు ఏడుగురు సంతానం. వీరిలో ఒక మగ, మిగిలిన వారంతా ఆడ సంతానం. చివరివారైన గుంపుల రీటా ప్రభుత్వ ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తూ ప్రవృత్తిగా సేవా కార్యక్రమాలు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. తన తల్లిదండ్రులు ఇద్దరూ కాలం చేసిన అనంతరం వారి జ్ఞాపకార్థం 2019లో సెవెన్ ఆలివ్స్ ఫౌండేషన్‌ను రిజిస్ట్రేషన్ చేసి, తద్వారా సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. నరసాపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు, పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి సహకారం అందిస్తున్నారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఫీజులు చెల్లిస్తున్నారు. సివిల్స్ శిక్షణను పొందే వారికి, డిగ్రీ, నర్సింగ్ వంటి చదువులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. సెవెన్ ఆలివ్స్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు సేవా కార్యక్రమాలకు సుమారు రూ.అరకోటి వెచ్చించినట్టు చెప్పారు. భవిష్యత్తులో తమ తోబుట్టువుల సహకారంతో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని టీచర్ రీటా వివరించారు. తన సోదరుడు గుంపుల జనార్దన్ మధ్యప్రదేశ్ రాష్ట్ర అడిషనల్ డీజీపీగా పనిచేసి పదవీ విరమణ పొందారని, మిగిలిన ఐదుగురు ఉపాధ్యాయ, అధ్యాపక వృత్తుల్లో స్థిరపడ్డారని చెప్పారు.

పారిశుద్ధ్య కార్మికులకు సామగ్రి పంపిణీ


మొగల్తూరులో పారిశుద్ధ్య సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మొగల్తూరు పంచాయతీ కార్యాలయం వద్ద తడి, పొడి చెత్తను వేరు చేసి, అందించే విధంగా గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా 33 మంది పారిశుద్ధ్య కార్మికులకు సబ్బులు, ఫౌడర్లు, నాప్‌కిన్లు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణ, ఉపసర్పంచ్ బోణం నర్సింహారావు, వార్డు సభ్యులు, ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్, గ్రామ కార్యదర్శులు నాగేశ్వరరావు, సుబ్బారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాలమూరు దేవతల జాతర


పాలమూరు గ్రామ దేవతల ఊయల సేవ

పాలకొల్లు అర్బన్: మండలంలోని పాలమూరు గ్రామ దేవతలైన మారెమ్మ, నిలువులమ్మ వార్ల జాతర 15 రోజుల మహోత్సవాలు సోమవారం ముగిశాయి. ఆదివారం రాత్రి జాతర వైభవంగా నిర్వహించారు. నిప్పులగుండం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో నిప్పులగుండం తొక్కి తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు. ఊయల స్తంభం సెంటర్‌లో గ్రామ దేవతలకు ఊయల సేవ నిర్వహించారు. అనంతరం అమ్మవారిని గుడికి సాగనంపారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పంతం నాగేశ్వరరావు, కన్వీనర్ కొక్కిరిమెట్ల వీరనాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ పంచదార లక్ష్మీనారాయణ స్వామి నాయుడు, గ్రామ పెద్దలు, యువజనులు, మహిళలు అమ్మవార్లకు జాతర నిర్వహించారు. ఆలయ ఆవరణలో పుట్టింటికి వచ్చిన నవ వధువులకు, ఆడపడుచులకు పసుపు, కుంకుమ, ప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను ఆలయ ఆవరణలో వేలం నిర్వహించారు.

పీజీఆర్ఎస్‌కు నాలుగు ఫిర్యాదులు


ఆకివీడు: ప్రజా పరిష్కార వేదికకు 4 ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని సోమవారం తెలిపారు. రుద్రయ్యకోడు మురుగు కాల్వగట్లపై ఉన్న ఇళ్ల తొలగింపు సమస్యకు పరిష్కారం చూపాలని అజ్జమూరుకు చెందిన వర్ధినేని వెంకటరత్నం ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై అనేక ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారన్నారు. 2023 ఆగస్టు 1న తన ఇంట్లో జరిగిన చోరీ కేసులో దొంగ దొరికినప్పటికీ ఎత్తుకెళ్లిన బంగారు ఆభరణాలు, నగదు తనకు ఇవ్వలేదని వెలంపేటకు చెందిన జామిశెట్టి దుర్గ ఫిర్యాదు చేశారన్నారు. అయిభీమవరంలోని తన స్థలంలో ఉన్న తాడి చెట్లను కొట్టుకుపోయారని గత ఏడాది డిసెంబర్ 19న ఫిర్యాదు చేసినా ఇంత వరకూ చర్యలు తీసుకోలేదని కనుమూరు సత్యనారాయణరాజు ఫిర్యాదు చేశారని చెప్పారు. స్థానిక పెదపేటలోని 2.80 ఎకరాల సీబీసీఎన్‌సీకి చెందిన భూమిని సరే చేసి, హద్దులు చూపించాలని జి.జోసఫ్‌రాజు అర్జీ సమర్పించారన్నారు.

హెల్మెట్ల పంపిణీ


హెల్మెట్ అందిస్తున్న సీఐ, జడ్జి

పాలకొల్లు అర్బన్: ద్విచక్ర వాహనచోదకులకు హెల్మెట్ ధారణ తప్పనిసరని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్ అన్నారు. మండల లీగల్ సర్వీసెస్, పాలకొల్లు రూరల్ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కోర్టు ఆవరణలో ద్విచక్ర వాహనచోదకులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. హెల్మెట్ ధరించకపోవడం వల్లనే రోడ్డు ప్రమాదాలు జరిగే సమయంలో ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారని చెప్పారు. హెల్మెట్లు ఉచిత పంపిణీకి ముందుకొచ్చిన రూరల్ లయన్స్‌క్లబ్ సభ్యులను జడ్జి జియావుద్దీన్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ సివిల్ జడ్జి వీఎస్ఎన్ లక్ష్మీలావణ్య, సీఐ కోలా రజనీకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ సూర్యనారాయణ, క్లబ్ మాజీ అధ్యక్షుడు గోటేటి ఫణిబాబు, కోశాధికారి కుక్కల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో తేడాలపై గ్రామ సభలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణంరాజు

నరసాపురం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తేడాలుంటే గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాలని ఎంపీడీఓ గాధిరాజు రామకృష్ణంరాజు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సామాజిక తనిఖీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మైలాబత్తుల సోని మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఆడిట్ నిర్వహించి గ్రామ సభల అనంతరం మండలంలో జరిగే ప్రజావేదికలో ప్రెసెడింగ్ అధికారి సమక్షంలో నిర్ణయాలు తీసుకొంటున్నట్టు చెప్పారు. సమావేశంలో ఎస్ఆర్‌పీ ఎస్ గోవిందు, ఏపీఓ వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం కేసులో వ్యక్తి అరెస్టు

వీరవాసరం: అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు సోమవారం తెలిపారు. వీరవాసరం మండలం బలుసు గొయ్యలపాలెం గ్రామానికి చెందిన ఇళ్ల నాగ సత్యనారాయణ అక్రమ మద్యం అమ్ముతుండగా దాడి చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి నుంచి ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎక్సైజ్ ఎస్సైలు సునీల్ కుమార్, ఉమా మహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.